గుడ్, బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

కిశోర బాలికలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా కిశోర బాలికలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా మీద చేయి వేయడం, ఛాతి, భుజాలు, తొడలపై చేతులు వేస్తే తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. అపరిచిత వ్యక్తులు తినుబండారాలు, బహుమతులు ఆశ చూపించినా ఆశపడి వారి వెంట వెళ్లకూడదన్నారు. ఒంటిగా వెళ్లేటప్పుడు ఆటో, బైక్, సైకిల్‌పై లిఫ్ట్ ఇస్తామని పిలిచినా వెళ్లకూడదని సూచించారు. బాల్య వివాహాల వలన భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెంబర్లు 100, 112, 1098కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పి అమృతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుదైన నేత సీతారాం ఏచూరి

సంస్మరణ సభలో వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

దేశ రాజకీయాల్లో అరుదైన నాయకులు సీతారాం ఏచూరి అని వివిధ పార్టీల నాయకులు అన్నారు. గొప్ప లౌకిక విలువలు కలిగిన మహాయోధుడిని కోల్పోయామన్నారు. ఏచూరి స్ఫూర్తితో లౌకిక, ప్రజాస్వామ్య, అభ్యుదయ శక్తులు ఐక్యంగా మతోన్మాద విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభను కడప ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఏచూరి చిత్రపటం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ఏచూరి ఆశయ సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామిక మౌలిక విలువల పరిరక్షణ కోసం అరహరం శ్రమించిన గొప్ప నాయకున్ని కోల్పోవడం బాధాకరమన్నారు. పార్లమెంట్‌కు దారిదీపం లాంటి నాయకుడిని దేశం కోల్పోయిందని పరస్పర బిన్న సిద్ధాంతాలు కలిగిన పార్టీల నాయకత్వాలు (ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ, సోని యాగాంధీ) పేర్కొనడాన్ని గుర్తు చేశారు. గొప్ప లౌకిక విలువలు కలిగిన మహాయోధుడిని కోల్పోయామన్నారు. జెఎన్‌యుకు మూడు సార్లు అధ్యక్షునిగా పనిచేసిన ఘనత వహించారన్నారు. సిపిఎంలో అగ్ర గణ్యులైన పుచ్చలపల్లి సుందరయ్య, బసవపున్నయ్య, హరికిషన్‌కింగ్ సూర్జిత్ వంటి ఉద్దండుల సాహచర్యంలో ఎదిగారన్నారు. ప్రపంచంలో సోషలిస్టు దేశాలు కూలుతున్న సమయంలో సోషలిజమే ప్రపంచానికి శరణ్యమని తీర్మానాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ మౌలిక విలువల్ని నాశనం చేస్తున్నారని, రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఎన్డీయే ప్రభుత్వానికి లేదని చేసిన ప్రసంగం చర్చనీయాంశంగా మారిందన్నారు. పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ ఏచూరి విలక్షణ, విశిష్టత, వ్యక్తిత్వం కలిగిన నాయకునిగా నిలిచిపోయాడన్నారు. దేశంలోని ఆరు జాతీయ పార్టీల్లో సిపిఎం ఒకటని, అటువంటి పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అరుదైన నాయకునిగా నిలిచారన్నారు. రాజ్యసభలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలవడంతోపాటు దేశంలోని ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటములకు ఇరుసుగా నిలిచా రన్నారు. ప్రజాస్వామ్యవాది, లౌకికవాది, సామ్యవాది, రాజ్యాంగ పరిరక్షణవాదిగా కీర్తి గడించారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలిగా నిలిచారన్నారు. రక్తదానం, నేత్రదానం, అవయవ దానం చేయడం చూశామని, తన పార్థివ దేహాన్ని సైతం సమాజ హితం కోసం ఎయిమ్స్‌కు అప్ప గించిన అరుదైన గొప్ప నేతల్లో ముందు వరుసలో నిలుస్తారని కొనియాడారు. సిపిఎం జిల్లా మాజీ కార్యదర్శి బి.నారాయణ మాట్లాడుతూ సోషలిజం పరివర్తన దశకు చేరుకోవాలంటే మతతత్వ శక్తులను పారదోలాలని చెప్పారని గుర్తు చేసుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్ మాట్లాడుతూ యునైటెడ్‌ఫ్రంట్, యుపిఎ, ఇండియా కూటముల ఏర్పాటులో ఏచూరి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ జెఎన్‌యు ఎన్నికల్లో వామ పక్షాల గెలవడం వెనుక ఏచూరి స్ఫూర్తి ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం మొదలుకుని విద్యార్థి ఉద్యమం వరకు ఏచూరి పోరాట పటిమ ఎన్నదగ్గదని కొనియాడారు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు డబ్ల్యు.రాము, సిపిఐఎంఎల్ జిల్లా నాయకులు రమణయ్య మాట్లాడుతూ దేశం సంక్షోభ సమయంలో ఏచూరిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆర్ ఎస్‌పి జిల్లా నాయకులు కె.సుబ్బరాయుడు మాట్లా డుతూ ఐక్యఉద్యమాలతోనే ఫాసిస్టులను ఓడిం చగలమన్నారు. ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా నాయకులు జయవర్ధన్ మాట్లాడుతూ ఏచూరి అందించిన స్ఫూర్తితో ముందుకెళ్తామన్నారు. బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప మాట్లాడుతూ ఏచూరి దేశానికి చేసిన అపారమని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రతినిధి డాక్టర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఏచూరి నిస్వార్థ ప్రజాసేవకుడని కొనియాడారు. మహాజనపార్టీ నాయకులు ఎస్.మనోహర్ మాట్లాడుతూ సామ్యవాద, ప్రజా స్వామిక, సోషలిజం కోసం అరహరం కృషి చేసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. లోక్‌సత్తా నాయకులు డి.కృష్ణ మాట్లాడుతూ ఏచూరి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐఎన్ సుబ్బమ్మ మాట్లాడుతూ ఏచూరి గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఉపాధి హామీ చట్టం రూపకల్పనే నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మనోహర్, రామమోహన్, శివకుమార్, దస్తగిరిరెడ్డి, శ్రీని వాసులరెడ్డి, చంద్రారెడ్డి, సత్యం, శివకుమార్, జిల్లా నలుమూలల నుం చి ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ప్రముఖులు, వృద్ధులు, మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఎం.ఎ.గఫూర్

ఎన్.తులసిరెడ్డి

జి.చంద్రశేఖర్

బి.నారాయణ

జి.చంద్ర

బి.మనోహర్

ఐ.ఎన్.సుబ్బమ్మ

ఎస్.గుర్రప్ప

సీతారాం ఏచూరి సంతాప సభకు హాజరైన వామపక్ష మద్దతుదారులు, లౌకిక వాదులు, ప్రజా సంఘాల నాయకులు

జి.రమణయ్య

ఎస్.మనోహర్

ఎస్.హరీంద్రనాథ్

కె.సుబ్బరాయుడు

జి.జయవర్ధన్

డి.కృష్ణ

డిఇఒ శివప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమ బాట

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - రాయచోటి

సుదీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యచరణలో భాగంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డిని కలిసి ఉద్యమ కార్యచరణ నోటీసు ఇచ్చామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి సుమారు పదేళ్లు కావస్తున్నప్పటికీ పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు ఇవే విద్యా వ్యవస్థలో భాగంగా ఉన్న మున్సిపల్ టీచర్లకు మాత్రం వర్తించక పోవడం అన్యాయమన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3,4,5 తరగతులను విలీనం చేశారే తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్ చేయలేదన్నారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఇఒల పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల పిఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీలలో నిరుపయోగంగా వడి ఉన్నాయని, జీతాల నుంచి మినహాయించే సొమ్ము వారి ఖాతాలకు జమ చేసేందుకు కానీ, ఖాతాలలో ఉన్న సొమ్ము అవసరాలకు వినియోగించు కునేందుకు కానీ అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యలపై ఎన్నిమార్లు ప్రాతినిధ్యం చేసినా అవి పరిష్కారానికి నోచుకోకపోవడం వల్ల మున్సిపల్ టీచర్ల ఆందోళన రోజు రోజుకూ తీవ్రమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్యాచరణ చేపట్టాలని యుటిఎఫ్ నిర్ణయించిందన్నారు. మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జిటి, పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేయాలన్నారు. మున్సిపల్ టీచర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అక్టోబర్ 2న మున్సిపాలిటీలలో సత్యాగ్రహ దీక్ష, 17న డిఇఒ కార్యాలయాల వద్ద సత్యాగ్రహ దీక్ష, 24న డైరెక్టరేట్ వద్ద 24 గంటల ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పి వెంకటరమణ, ఉమ్మడి చిత్తూరు జిల్లా పూర్వ గౌరవ అధ్యక్షులు జి రాధాకృష్ణ, ఏపీ ఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, ఏపీ ఎంఎస్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు సాధిక్ అలీ ఖాన్, మదనపల్లె అర్బన్ నాయకులు హరికృష్ణ పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ ఆవరణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి -కలకడ

పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న భూములను స్థానికులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. శుక్రవారం పోలీసుస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు సంబంధించిన పరిసర భూములను పరిరక్షించుకోవడంలో ప్రభుత్వం నిబంధనలు విధించిందని తెలిపారు. వాటిని అతిక్రమించి స్థానికులు ఎవరైనా పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న భూములను ఆక్రమించిన అనుభవించాలని ఆలోచన వచ్చిన వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది చర్యలు తీసుకొని స్టేషన్ ఆవరణ భూములను పరిరక్షించడంలో పాత్ర వహించాలన్నారు. రెవెన్యూ వారు స్టేషన్ పరిధిలో ఉన్న భూములను పరిరక్షించే క్రమంలో సర్వే చేసి మాకు సహకరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, రోడ్డు భద్రత నియమాలను పాటించే విధంగా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. మండలంలో చోరీలు పేకాట నియంత్రణకు చర్యలు నాటు సారా తయారీ అమ్మకాలను నియంత్రించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్‌పి కృష్ణమోహన్, తహశీల్దార్ ఫణి కుమార్, సిఐ గురునాథ, ఎస్ఐ రామాంజనేయులు, సర్వేయర్ దేవి, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె ఆర్‌టిఒగా అశోక్ ప్రతాప్‌రావు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె నూతన ఆర్‌టిఒగా డి.అశోక్ ప్రతాప్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె ఆర్‌టిఒ కార్యాలయం అప్ గ్రేడ్ అయినప్పటి నుంచి ఇక్కడ ఆర్‌టిఒ లేక పోవడంతో కమర్షియల్ వాహనాలన్నీ ఎఫ్‌సి తప్ప మిగతా అన్ని రకాల పనుల కోసం జిల్లా హెడ్ క్వార్టర్‌లోని రాయచోటికి వెళ్లాల్సి ఉండేదని పేర్కొన్నారు. మదనపల్లికి రెగ్యులర్ ఆర్‌టిఒ నియామకంతో ఆ సమస్యకు పరిష్కారమైందన్నారు. ఇప్పటికే ఇక్కడ ముగ్గురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వారిలో దినేష్ చంద్ర, శివ లింగయ్య, శ్రీహరి ముగ్గురు పనిచేసేవారు. ఆర్‌టిఒగా అశోక్ ప్రతాప్‌రావు రావడంతో వాహన యజమానులు, డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారతావని ముద్దుబిడ్డ భగత్‌సింగ్

మాట్లాడుతున్న న్యాయవాది సోమశేఖర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భారతావని ముద్దుబిడ్డ భగత్‌సింగ్ అని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి అధ్యక్షతన భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భారత స్వాతంత్ర పోరాటంలో భగత్ సింగ్ అనాడు యువతకు మార్గదర్శకుడయ్యారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్రంలో జన్మించిన ఈయన లాహోరులో విద్యాభ్యాసం చేశాడన్నారు. భగత్ సింగ్ బ్రిటిష్ పాలన వ్యతిరేకని, జలియన్ వాలాబాగ్ బ్రిటిష్ అణచివేత విధానాలకు ధీటుగా విప్లవ సిద్ధాంతాలతో స్వాతంత్రం పొందాలని భావించినట్లు తెలిపారు. ఢిల్లీ సెంట్రల్ అసెంబ్లీలో బాంబు విసిరి పట్టుపడి ఉరిశిక్షకు లోనైన భగత్ సింగ్ ఆనాటి నుండి ఈనాటి వరకు యువతకు స్ఫూర్తిగా నిలిచాడన్నారు. నేటి యువత కూడా దేశ రక్షణకు, అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పోర్డ్ డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ నేటి యువత ప్రతిరోజు నాయకులను గురించి ఒక్కొక్కరిగా తెలుసు కోవాలని, వారి స్ఫూర్తితో ముందుకు నడిచి స్వయం సమృద్ధి సాధించాలని కోరారు. న్యాయవాది సోమశేఖర్ మాట్లాడుతూ యువత దేశ భవితకు ఔన్నత్యానికి కృషి చేయాలని కోరారు. బిసి సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేష్ మాట్లాడుతూ దేశం పట్ల ప్రేమ గౌరవం పెంపొందించుకోవాలని తెలియజేశారు. విద్యాసంస్థల అధ్యక్షుడు కేశవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భగత్ సింగ్ భావాలు, దేశ నాయకుల ఆలోచనలను ఆకలింపు చేసుకుని భవితకు కృషి చేయాలని కోరారు. ఎన్ఎస్ఎస్ అధికారి సేగు రెడ్డప్ప రెడ్డి మాట్లాడుతూ యువత దేశ సేవకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు శివ పార్వతి దేవి, తాళంబేడు సాయి శంకర్ రెడ్డి, గంగరాజు జెఎసి నాయకులు ఉత్తన్న, విద్యార్థులు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌లో విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలి : డిఇఒ

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రజాభిప్రాయ సేకరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మిళిత అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరును, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే విధంగా స్వర్ణాంధ్ర విజన్ - 2047ను రూపకల్పన చేశారన్నారు. ఈ విషయమై అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా సర్వేలోని అంశాలపై తమ అభిప్రాయాలను నమోదు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారన్నారు. ఈ సర్వేలో ఎక్కువ మంది పాల్గొనేలా మండల విద్యాశాఖాధికారులు, ప్రధానో పాధ్యాయులు చొరవ చూపాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో ఉన్న భవిత కేంద్రాన్ని సందర్శించారు. విభిన్న ప్రతిభావంతుల విద్యార్థుల బోధనకు ఉపయోగిస్తున్న బోధనోపకరణాలను, బోధన చేస్తున్న తీరును పరిశీలించారు. మండలంలోని విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులను భవిత కేంద్రంలో తప్పనిసరిగా నమోదు చేయించి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వారి తల్లిదండ్రులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అదే ఆవరణంలో ఉన్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాల గదికి చేరుకుని రెండవ సెమిస్టర్ పాఠ్యపుస్తకాల పంపిణీని పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ డిస్టిక్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, ఎంఇఒ-1 రమాదేవి, ఎంఇఒ-2 శ్రీనివాసులు, సమ్మిళిత విద్య ఉపాధ్యాయులు రవి, ప్రసాద్, హరిత, హెడ్ టీచర్ జయమ్మ, ఎంఐఎస్ కో- ఆర్డినేటర్ పుష్పలత, ఎంఆర్‌సి కంప్యూటర్ ఆపరేటర్ ప్రదీప్, సిఆర్‌పి నరేంద్ర పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ చేస్తున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

మున్సిపల్ మేనేజర్‌ను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మున్సిపల్ మేనేజర్‌గా మనోహర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి మున్సిపాలిటీ మేనేజరుగా పి.ఆర్.మనోహర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం గ్రామ, వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు కలసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సచివాలయం ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులకు తన వంతు సహాయ, సహకారాలు ఎల్లపుడు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిపి.వినోద్ కుమార్, నాయకులు శ్రీనివాసులు, శారద, రవీంద్ర నాయక్, ఉస్మాన్, రెడ్డెప్ప, రమేష్ పాల్గొన్నారు.

జగన్ రాకుండా అడ్డుకోవడం తగదు : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తిరుమల స్వామివారి దర్శనానికి వెళ్తున్న మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని అడ్డుకోవడం టిడిపి నాయకుల పిరికిపంద చర్య అని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని మాజీ సిఎంను అడ్డుకోవడం కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం డిక్లరేషన్ విధానాన్ని తెరపైకి తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. అనేక మార్లు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించిన మాజీ సిఎంను అడ్డుకోవడం తెలుగుదేశం పార్టీ పతనానికి నాందన్నారు. జగన్‌ను స్వాగతించేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యేలను, వైసిపి నాయకులను ఎక్కడిక్కడ పోలీసులు గృహనిర్బంధనం చేయడం, నోటిసులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకష్ట అని, దీనికి సాక్షాత్తు కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి తగిన శిక్ష విధిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు నీళ్ల భాస్కర్, బిడ్డల కేశవ రెడ్డి, మధనమోహన్ రెడ్డి, శ్రీధర్‌రాయల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ భారతి

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం : మాతా శిశు మరణాల నివారణే లక్ష్యమని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ భారతి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పోషన్ మాసోత్సవాల్లో భాగంగా గర్భవతులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషకాహారం తీసుకోవడం ద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టడమే కాకుండా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వొచ్చని చెప్పారు. పండ్లు, కూరగాయలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అనంతరం మాజీ ఎంపిపి వలిగట్ల వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, నాయకులు పివి నారాయణ, చంద్రమౌళి, గాంధీపేట రమణ, మురళి, ఆదినారాయణ, పద్మనాభ రెడ్డి, సూపర్‌వైజర్ రోహిణి పాల్గొన్నారు.

22 మందికి కంటి శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : లయన్స్ క్లబ్‌లో 22 ఉచిత కంటి చికిత్సలు నిర్వహించామని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ నివేదిత, జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. శుక్రవారం స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి చికిత్సలు పూర్తి చేసుకొన్న వారికి వైద్యులు సూచనలు, మందులు అందించి వారి ఇండ్లకు పంపామన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లి ప్రత్యేక కార్యాచరణలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఈ సేవలు అవసరమైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రక్త సమూనా నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులకు రక్త సమూహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ జయభారతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున సహకారంతో 120 మంది విద్యార్థులకు రక్త సమూనా నిర్ధారణ పరీక్షలను చేసినట్లు చెప్పారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రత్యూష, ల్యాబ్ టెక్నీషియన్ హాజీరల సహకారంతో విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల రక్త గ్రూపులను నిర్ధారించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రమాదాలు జరిగినప్పుడు వారికి రక్తం అవసరమైన సమయంలో వారి గ్రూపుకు సంబంధించిన రక్తాన్ని అందించడానికి ఈ పరీక్షలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.రమణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పుష్ప కుమారి, కళాశాలఅధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇగా మిథున్‌చక్రవర్తి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గ్రామీణ నీటి సరఫరా ఎఇగా బి.మిథున్ చక్రవర్తి శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎఇ రెడ్డిరాణి మదనపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయానికి బదిలీ కాగా వాల్మీకిపురంలో పనిచేస్తున్న మిథున్ చక్రవర్తి నిమ్మనపల్లె నూతన ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇగా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుం టామని చెప్పారు. ప్రజలకు శుద్ధమైన తాగునీరును అందించటానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి ఇంటికి నీటిని అందిస్తామని వివరించారు.

రామసముద్రం ఎపిఎంగా సాంబశివ

రామసముద్రం : మండల ఎపిఎంగా జి.సాంబశివ శుక్ర వారం బాధ్యతలు స్వీకరిం చారు. సిసిలు రామసముద్రం క్లస్టర్ గంగాధర్, చెంబకూరు క్లస్టర్ శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎపిఎం సుబ్రమణ్యం మదనపల్లికి సాధారణ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక మహిళ సంఘలు సభ్యులు నగదు రహిత లావాదేవీలు పై పూర్తి దృష్టి సారించాలని అన్నారు. సాదారణ బదిలీల్లో భాగంగా పుంగనూరు మండలం నుంచి వచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ శాఖ డిఇగా హరికుమార్

మదనపల్లె అర్బన్ : మదనపల్లె విద్యుత్ డిఇగా వై.హరికుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డిఇ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మదనపల్లె ట్రాన్ కో డిఇగా హరి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. డిఇని 1104 యూనియన్,ఒసి అసోసియేషన్ తరపున నాయకులు, సభ్యులు డిఇని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామలింగారెడ్డి, కార్యదర్శి శేషాద్రి నాగరాజు, రఘు, మురళి, రామకృష్ణ, దాదం రామలింగారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ఆనందరెడ్డి, ఎర్రంరెడ్డి ఉన్నారు.

'మిట్స్'లో ప్రారంభమైన ఎంసిఎ, ఎంబిఎ తరగతులు

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసిఎ, ఎంబిఎ మొదటి సంవత్సరం తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకానాథ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, మొదటి సంవత్సరం విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ నాదెళ్ల ద్వారకానాథ్ మాట్లాడుతూ కళాశాలలో చేరిన విద్యార్థులను తమపై ఉన్న నమ్మకంతో తమ పిల్లలను ఇక్కడ చేర్చిన తల్లిదండ్రులకు కృతతలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందఉచుకోవాలన్నారు. నాణ్యత మైన విద్యను విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్న్‌షిప్‌లను అందజేస్తున్నామని, విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ఎంసిఎ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, బ్లాక్ చైన్, మెషిన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని పరిశోధనలపై దృష్టి సాధించాలని తెలిపారు. కళాశాలకు ఎన్‌బిఎ, నాక్ ఏం అక్రిడిటేషన్‌లు ఉన్నాయన్నారు. విద్యార్థులు కళాశాలలోని ల్యాబ్, లైబ్రరీ, ఇన్నోవేషన్ సెల్, మొదలైన వాటిని సకాలంలో వాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ గీత దేవి, డాక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయతీ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నేడు ఉచిత దంత వైద్య శిబిరం ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ యశ్వంత్ ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరంలో దంతాలకు సంబంధించిన పలు రకాల వైద్య చికిత్సలు డిజిటల్ ఇంట్రా ఓరల్ కెమెరా ద్వారా నిర్వహిస్తారని, కంప్యూటర్ ద్వారా అవగాహన కల్పించి చికిత్స అందిస్తారని తెలిపారు., దంత సమస్యలు ఉన్నవారికి అధునాతన పద్ధతిలో రాయితీతో కూడిన వైద్యం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దంత సమస్యలు ఉన్నవారు ఉచిత దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మండలంలోని కోళ్లబైలు పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా వెల్లడించారు. శుక్రవారం కోళ్లబైలు పంచాయతీ వెంకటేశ్వరపురం, బాబుకాలనీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజల అభీష్టం మేరకు పనిచేసే ప్రభుత్వమన్నారు. గ్రామీణ ప్రజల అవసరాలను గుర్తించి వారి విజ్ఞప్తి మేరకు పెద్దఎత్తున రోడ్లు మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ ప్రాంతంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత నిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనను అటకెక్కించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రజలతో మమేకమై వారి అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ క్రమంలోనే గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.ప్రజల సమస్యలను పరిష్కారం చేసే ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, యర్రబల్లి వెంకటరమణ రెడ్డి, మోహన్ రెడ్డి, రెడ్డి రాయల్స్, ఎంపిడిఒ భాను ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం నీరుగట్టువారిపల్లె, మునెప్ప కాలనీల్లో మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలుష్యం అమాంతం పెరిగిపోయి వాతావరణం కలుషితమౌతోన్న తరుణంలో ఈ కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపుతున్నాయని అన్నారు.రాష్ట్రంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పరిక్షించుకోవాలని కోరారు. వర్షాలు కురవాలన్నా, పంటలు బాగా పండాలన్నా మొక్కలు నాటాలని అన్నారు. ఆరోగ్య జీవనశైలి స్వచ్ఛమైన గాలితోనే సాధ్యమని అన్నారు. మదనపల్లి పట్టణంలో ఇప్పటికే వేలాది మొక్కలు నాటామని, మొత్తం పదివేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వాతి చక్రపాణి, టిడిపి నాయకులు రామిశెట్టి, కృష్ణ, సంగం శ్రీనివాసులు, నాదెళ్ల శివన్న, నాగార్జున బాబు, కలకడ వేణుగోపాల్, ఇంతియాజ్, దుబ్బిగాళ్ల భాస్కర్, కదిరి రాజకుమార్, మంజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు

వీరబల్లి: రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులు

వీరబల్లి : ఎస్‌జిఎఫ్ అండర్-19 క్రీడా పోటీల్లో వీరబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు.. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అజంతుల్లా మాట్లాడారు. పుల్లంపేట ఎపి మోడల్ స్కూల్‌లో జరిగిన క్రికెట్ పోటీలలో డి.గిరి వర్ధన్, వి.రామ్‌చరణ్, పి.తోఫిక్ అలీఖాన్ రాష్ట్రస్థాయి జుట్టుకు ఎంపిక అయ్యారని తెలిపారు. సాఫ్ట్ బాల్‌లో పి.మహీధర్, సి.తిరుమల ,బేస్‌బాల్‌లో పి.మహిధర్, ఎస్.అఫ్జల్ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికావడం హర్షణీయమని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.రఘురామయ్య మాట్లాడుతూ విద్యార్థులు మరింత కష్టపడి జాతీయస్థాయి జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య, భాస్కర్, కళాశాల అధ్యాపకులు శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రశేఖర్, అరుణమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్‌రాజు, రాధాకృష్ణ, ప్రసాద్, చంద్రకళ, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఊటుకూరు విద్యార్థులు

రాజంపేట అర్బన్ : ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ పోటీల లో వివిధ క్రీడలలో పాల్గొన్న ఊటుకూరు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషిని తెలిపారు. అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీలలో ఉద్దండకు హారిక ప్రథ మ స్థానం, లాంగ్ జంప లో ద్వితీయ స్థా నంలో ఎంపికైనట్లు చెప్పారు. మలిశెట్టి ధరణి కబడ్డీలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైందని అన్నారు. 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో బొక్కు రోషిణి, బాలుర లాంగ్ జంప్‌లో సి.మోక్షజ్ఞ ద్వితీయ స్థానంలోనూ, అండర్-17 వాలీబాల్ లో శివ కేశవ, అండర్ -14 లో ధీరజ్‌లు రాణించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పీడీ నాగ రాజారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సత్తా చాటిన విజ్‌డమ్ విద్యార్థులు

రైల్వేకోడూరు: నియోజకవర్గ స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడలలో విజ్‌డమ్, సిబిఎస్ఇ హైస్కూల్ విద్యా ర్థులు సత్తా చాటా రనిడ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-17 జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు విష్ణు, ఖోఖో విభాగంలో గుణచరణ్, బ్యాడ్మింటన్‌లో రాహుల్, అండర్-14 విభాగంలో బ్యాడ్మింటన్, వాలీబాల్ జట్టుకు లీల వెంకట్, అండర్-17 ఖోఖో బాలికల జిల్లా జట్టుకు మధులత ఎంపికయ్యారని తెలిపారు. బాలికల 200 మీటర్ల పరుగు పందెంలో వేద రెండో స్థానం, 400 మీటర్ల పందెంలో నిహారిక రెండవ స్థానం, 400 మీటర్ల బాలుర విభాగంలో జశ్వంత్ మూడవ స్థానం, షార్ట్ పుట్ విభాగంలో సంజన నియోజక స్థాయిలో రెండవ స్థానం సాధించారని అన్నారు. క్రీడలలో సత్తా చాటిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యా యులను చైర్మన్ ప్రదీప్‌తో పాటు అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్మోహన్, ప్రిన్సిపల్ టి.ప్రియాంక విద్యార్థులను అభినందించారు.

రైల్వేకోడూరు: ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్

చారిత్రక ప్రదేశాలను కాపాడుకుందాం : హెచ్‌ఎం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన, చరిత్ర కలిగిన పర్యాటక ప్రాంతాలను కాపాడుకుందామని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) ప్రధానోపాధ్యాయులు అంజాద్‌అలీఖాన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఎన్‌సిసి సిటిఒ వెంకటగోపాల్ ఎన్‌సిసి విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాన్నినిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం పురాత నమైన, చరిత్ర కలిగిన ప్రపంచ పర్యాటక ప్రదేశాలకు నిలయమని అన్నారు. అటువంటి ప్రదేశాలను సురక్షితంగా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ చరిత్ర కలిగిన పర్యాటక ప్రాంతాలను సందర్శించి, వాటి ఘనతను తెలుసుకొని జ్ఞానాన్ని పొందాలని, అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యాన్ని, దేశభక్తిని, నాటి శిల్పకలల నైపుణ్యతాన్ని తెలిపే ఎన్నో ప్రదేశాలు మనదేశంలో ఉన్నాయని అన్నారు. ప్రతి విద్యార్థి వాటిని సందర్శించి దేశ సంప్రదాయాలు, విలువలపై గౌరవం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశాల చిత్రాలను ప్రదేశాలను ప్రదర్శిస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెసి

నాణ్యమైన భోజనాన్ని అందించాలి : జెసి

ప్రజాశక్తి-చిన్నమండెం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలిక ఉన్నత పాఠశాలను జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ భోజన వివరాలు అడిగి తెలుసుకుని విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఉన్న సమస్యల గురించి ఆరా తీస్తూ స్కూలుకు సంబంధించి ఆర్‌ఒ ప్లాంట్, కాంపౌండ్ గురించి చర్చించారు. ఉపాధి హామీ పథకం కింద కాంపౌండ్ వాల్ ఆర్డబ్ల్యూఎస్ స్కీం కింద ఆర్‌ఒ ప్లాంట్ మంజూరయ్యాయని వాటిని త్వరలో ప్రారంభిస్తారని, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పైకి రావాలని ఆకాంక్షించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి-కలికిరి

పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుంధతి తెలిపారు. శుక్రవారం వాల్మీకిపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కలికిరి మండలం కలికిరి సెక్టార్‌లో సెప్టెంబర్ ఒకటవ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే పోషణ మాసోత్సవంలో భాగంగా కలికిరి ఎంఆర్‌సి కాంపౌండ్ లో పోషణ వేడుకగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుంధతి మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం శక్తివంతమైన, బలమైన ఆహరంగా ఉండాలని అన్నారు. ఆహారం వండేటప్పుడు శుభ్రంగా ఉండాలని పోషక విలువలు వృధా కాకుండా ఉండాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మురాషా మాట్లాడుతూ ఉన్న ఆరోగ్యం మన పిల్లలకు లేకుండా ఉంది జబ్బులను తట్టుకునే శక్తి కూడా మనకు ఉంటుంది కానీ మన పిల్లలకు ఉండదు అని మన శరీరంలో ఎముకలు కంటే ఎక్కువ బలమైనది మన నోటిలోని పళ్లకు ఉన్న ఎనామిల్ అనేది అందువలన వేప పుల్లలతో పళ్ళు తోముకోవడం, మునగాకు వారంలో ఒకసారి తీసుకుంటే చాలా రకాల జబ్బులు రాకుండా ఉంటాయని అని తెలిపారు. తహశీల్దార్ మహేశ్వరిబాయ్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే ఆరోగ్యం బాగుంటే మంచి కుటుంబంతో పాటు మంచి సమాజం చూడవచ్చు అని ఆరోగ్యం బాగుంటేనే ఆర్థికంగా కూడా అందరూ బాగుంటమని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం దేవసేన, సూపర్‌వైజర్ అరుంధతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉచితంగా అధ్యయన పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేసే సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని సర్తాజ్ బేగం పదవ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర అధ్యయన పుస్తకాలను ఉచితంగా అందించారు. ఉద్యోగంలో చేరి 35 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు సొంత నిధులతో అధ్యయన పుస్తకాలను, పండ్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ మాట్లాడుతూ సర్తాజ్ బేగం ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థుల శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పునర్విభజనపై రాజకీయ పార్టీలతో సమీక్ష

ప్రజాశక్తి-పీలేరు

2025 ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించినట్లు పీలేరు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారిణి, హెచ్‌ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల తహశీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు అధికారిణి మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం పరిధిలో రెవెన్యూ ఉద్యోగుల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించడం జరిగిందని అన్నారు. అలాగే నియోజకవర్గంలోని పీలేరు మండలంలో 281వ పోలింగ్ కేంద్రం, కెవి పల్లి మండలం లోని 80, 83వ పోలింగ్ కేంద్రాలు 1500 మందికి మించి ఓటర్లను కలిగి ఉన్నాయని, ఈ బూత్‌ల పునర్విభజనపై సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో పీలేరు, గుర్రంకొండ, కలకడ, కెవిపల్లి, వాల్మీకిపురం, కలికిరి మండలాల తహశీల్దార్లు భీమేశ్వరరావు, శ్రీనివాసులు, ఫణికుమార్, క్రాంతికుమార్, పీలేరు ఎన్నికల డిటి చంద్రశేఖర్, తెలుగుదేశం జనసేన, బిజెపి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్‌కు డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-పీలేరు

డి.రూపేష్

పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి మూడో సంవత్సరం చదువుతున్న డి.రూపేష్ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి తరపున ప్రీ రిపబ్లిక్ డే పెరేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో జరగబోయే గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొనడానికి శిక్షణకు చేపట్టిన ఎంపిక ప్రక్రియలో కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ రూపేష్ ఎంపికయ్యాడు. ఇతను మహా రాష్ట్రలోని జల్గాంలో శిక్షణ తీసుకోనున్నాడు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్ రూపేష్‌ను కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు సుధాకర్‌రెడ్డి, ఎల్లయ్యను ప్రిన్సిపల్ అధ్యాపకులు అభినందించారు.

పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జిగా మహేష్

ప్రజాశక్తి-పీలేరు

జడ్జి మహేష్

పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జిగా ఎ.మహేష్ బాధ్యతలు స్వీకరించారు. న్యాయ మూర్తిగా పనిచేస్తున్న ఈయనను హైకోర్టు ఆదేశాల మేరకు కొత్తగా పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జిగా నియమించారు. ఇన్ ఛార్జి న్యాయమూర్తిగా ఉన్న 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు నుంచి శుక్రవారం 11వ అదనపు జిల్లా జడ్జిగా మహేష్ బాధ్యతలను తీసుకున్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక ఇన్‌ఛార్జి అధికారి రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని గ్లోబల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విన్యాసాల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఇంటి వద్ద అగ్గిపుల్లలతో ఆడుకోకూడదని చిన్న నిప్పులు పెద్ద మంటగా ఏర్పడి ఇండ్లలోని గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు. చిన్న పిల్లలకు అగ్నిపెట్టెలు దూరంగా ఉంచాల న్నారు. పెద్ద పెద్ద పరిశ్రమలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాక్షాయని, ఉపాధ్యాయులు,ఫైర్ సిబ్బంది సుదర్శన్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నిచ్చల్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల టిడిపి మండల యువ నాయకులు, మాజీ ఎంపిటిసి సభ్యులు మదనమోహన్, టిడిపి రాజంపేట పార్లమెంట్ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్ ఆధ్వర్యంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు మండిల్లి నిచ్చల్ రెడ్డి జన్మదిన వేడుకను లక్కిరెడ్డిపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిశ్చల్‌రెడ్డి గొప్ప స్థాయికి ఎదగాలని అభిశించారు. కార్యక్రమంలో మసూద్ , ముక్తా రహమత్ , నాగరాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

క్రైం కార్నర్

చోరీ గురించి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

గొల్లపల్లెలో నాలుగు ఇళ్లల్లో చోరీ

- మహిళ కేకలు వేయడంతో దుండగులు పరారీ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో గురువారం రాత్రి దొంగలు మూడు ఇళ్లల్లో తలుపులు, బీరువాలను పగలగొట్టి ఒక ఇంట్లో మాత్రమే నగదు, బంగారు కమ్మలు దోచుకెళ్లారు. నాలుగో ఇంటిలో దొంగతనానికి ప్రయత్నించడంతో ఇంటిలో ఉన్న మహిళ, ఆమె కుమారుడు కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం అర్ధరాత్రి గొల్లపల్లి గ్రామంలో గోపినేని కొండయ్య అనే వ్యక్తి తిరుపతిలో నివాసం ఉంటున్నారని ఇక్కడ ఇంటి బీగాలు వేసి ఉంచారని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపులు, బీరువా తలుపులను పగలగొట్టి అక్కడ ఏమి చిక్కకపోవడంతో అదే గ్రామంలో గొబ్బిళ్ళ మల్లికార్జున హైదరాబాదులో నివాసం ఉండడంతో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో అతని ఇంటి తలుపులను, బీరువాను పగలగొట్టి వెండి వస్తువులు ఉన్న ప్పటికీ వాటిని వదిలిపెట్టి 5 వేల రూపాయలు నగదు, ఒక జత చెవి కమ్మలను దోచుకెళ్లారని తెలిపారు. గోసి ప్రసాద్ అరవ పల్లెలో నివాస ఉండడంతో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపులను పగలగొట్టి చోరీకి ప్రయత్నించినప్పటికీ అక్కడ ఎటువంటి సామగ్రి లేకపోవడంతో ఎటువంటి వస్తువులు చోరి కి గురి కాలేదు. చివరకు ఆనంది రమాదేవి ఇంటి తలుపులను పగలగొట్టేందుకు ప్రయత్నించగా ఆమె, ఆమె కుమారుడు ఇంట్లోనే ఉండడంతో వారు కేకలు వేసి, బంధువులకు ఫోన్ చేయడంతో బంధువులు అక్కడికి చేరుకోవడంతో దొంగలు అక్కడి నుంచి పరారు అయ్యారని చెప్పారు. రాజంపేట రూరల్ సిఐ బి.వి రమణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్ర నిపుణులు రప్పించి వివరాల సేకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాత్రూంలో పడి మహిళకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్నానం చేసేందుకు బాత్రూం వెళ్లిన మహిళ ప్రమాద వశాత్తు కింద పడి అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలు కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కదిరి రోడ్డులోని అమ్మ చెరువు మిట్టలో కాపురం ఉంటున్న శ్రీనివాసులు భార్య మంజుల(35), బాత్రూంలో వేడి నీళ్ల బకెట్లోకి చన్నీళ్లు పోస్తున్న క్రమంలో కాలు జారి వెనక్కి పడి పోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలై, చెవుల్లోంచి రక్తం ధారగా కారి అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే బాధి తురాలిని కుటుంబీకులుసర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టపాసుల లారీ సీజ్

ప్రజాశక్తి-చిన్నమండెం

శివకాశి నుంచి టపాసులతో పొద్దుటూరుకి వెళ్తున్న లారీకి సేఫ్టీకి సంబంధించిన వసతులు లేవనే కారణంతో ఆర్‌టిఒ ఈనెల 24న అదుపులోకి పట్టుకుని తహశీల్దార్‌కు అప్పగించారు. ఈ విషయం పై శుక్రవారం తహశీల్గార్ మాట్లాడుతూ పట్టుపడ్డ లారీకి నియమ నిబంధన ప్రకారం సేఫ్టీ మెజర్స్ లేవని అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లారీని సీజ్ చేశామని, ఏదైనా ప్రమాదం జరిగితే నివారణ కోసం ఇసుక కార్బన్ మోనాక్సైడ్ వంటి సదుపాయాలు లేవని అన్నారు. లైసెన్స్ అనేది తప్పనిసరిగా ఉండాలని, 2008 నిబంధనల ప్రకారం రూట్ మ్యాప్,సేఫ్టీ మెజర్స్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. లారీని స్వాధీన పరుచుకుని, స్థానిక ఎస్ఐకి అప్పగించినట్లు తెలిపారు.